www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 19 ఏప్రిల్ 2025

5

కాకినాడ



ఆదిత్యలో జింబాబ్వే స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జింబాబ్వే స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ రిలేషన్ డైరెక్టర్ పరంజిత్ సింగ్, సీనియర్ మేనేజర్ ఇంటర్నేషనల్ అడ్మిషన్స్ మహమ్మద్ సమీమ్ జాఫర్, మేనేజర్ ఇంటర్నేషనల్ అడ్మిషన్స్ పవన్ కుమార్ నేతత్వంలో ఈ వేడుకలు నిర్వహించారు. జింబాబ్వే దేశానికి చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జెండా వందనం అనంతరం జాతీయ గీతం ఆలాపనతో కార్యక్రమాలు విద్యార్దులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదిత్య యాజమాన్యం విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు.

పశుపోషకులకు ఊతమేదీ..?

- షెడ్లు పూర్తయినా అందని బిల్లులు
- రూ.11 కోట్ల పైనే పెండింగ్
- మంత్రి పవన్ ప్రారంభించినా రాని బిల్లు
- పాడి రైతుల ఎదురు చూపులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్బాటంగా నిర్మిస్తున్న గోకులం షెడ్లకు బిల్లులు మంజూరు చేయడంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పెండింగ్‌లో ఉన్న బిల్లుల కోసం పాడి రైతులు గత 4 నెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ఆయన ప్రారంభించారు. రెండు నెలలు దాటిపోయినప్పటికీ ఆ షెడ్డు బిల్లు కూడా నేటికీ జమ కాలేదు. ఈ నేపథ్యంలో అప్పులు చేసి నిర్మించుకోవడంతో నెలల తరబడి సొమ్ములు జమ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పశు పోషకులకు ప్రభుత్వం ఇచ్చే ఊతమిదేనా అంటూ ప్రశ్నలు ఈ సందర్భంగా వినిపిస్తున్నాయి.

కాకినాడ జిల్లాలో 1380 షెడ్లు మంజూరు కాగా ఇందుకు రూ.30.14 కోట్ల నిధులు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇప్పటి వరకూ పలు మండలాల్లో 1,055 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం, షెడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం పశువుల షెడ్లు రూపంలో వాటి నిర్మాణాలకు పథకం ఏర్పాటు చేసింది. ఈ పథకంలో పశు వైద్యాధికారులు, ఉపాధి హామీ పథకం అధికారులను భాగస్వామ్యం చేసింది. 2 ఆవులు గానీ, గేదెలుగానీ ఉంటే రూ.1.15 లక్షలు, 4 ఆవులుగానీ, గేదెలు గానీ రూ.1.66 లక్షలు, 6 ఆవులుగానీ గేదెలుగానీ ఉంటే రూ.2.30 లక్షల చొప్పున అందిస్తోంది. 20 గొర్రెలు ఉంటే రూ.1.30 లక్షలు, 50 గొర్రెలకు రూ.2.30 లక్షలు, 100 కోళ్ల పెంపకానికి రూ.87వేలు, 200 కోళ్ల పెంపకానికి రూ.1.32 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇందులో లబ్ధిదారుని వాటా 10 శాతం మాత్రమే. దీంతో ఆయా మండలాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి నిర్మాణాలు చేపట్టాలని అదేశాలు జారీ చేయడంతో అనేకమంది అప్పులు చేసి నిర్మాణాలు పూర్తి చేశారు. లబ్ధిదారుల ఎంపికలో కూటమి ప్రభుత్వం వివక్ష చూపిందనే విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. తమ పార్టీలకు అనుకూలంగా ఉన్నవారినే ఎంపిక చేశారనే ఆరోపణలు గట్టిగానే వినిపించాయి. గతేడాది ఆగస్టులోనే రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆ సమయంలోనే కూటమి నేతలు సూచించిన వారికే లబ్ధి చేకూరేలా అధికారులు వ్యవహరించారనే వాదనలు వచ్చాయి.

పెండింగ్‌లో బిల్లులు

గోకులం షెడ్ల నిర్మాణం వేగంగా చేపట్టి పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో అనేకమంది పాడి రైతులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేశారు. నిర్మాణాలు పూర్తయినా బిల్లులు పడలేదని లబ్ధిదారులు అంటున్నారు. నిర్మాణాలు పూర్తయినా గతేడాది నవంబర్ నుంచి ఈ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పిఠాపురం మండలంలో 118 శాంక్షన్ కాగా 107 నిర్మాణాలు పూర్తయ్యాయి.



పిఠాపురం మండలం కుమారపురంలో బిల్లు అందని పవన్ కళ్యాణ్ ప్రారంభించిన పశువుల షెడ్డు

వీరిలో ఒక్కరికి మాత్రమే బిల్లు అందింది. మల్లం గ్రామానికి చెందిన పాటి రాజాబాబుకు రూ.1,79,783 బిల్లు పండింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం మండలం కుమారపురంలో ఈ ఏడాది జనవరి 10న ఆర్భాటంగా ప్రారంభించిన షెడ్‌కు నేటికీ బిల్లు అందలేదు. రూ.1.85 లక్షల బిల్లు కోసం పాడి రైతు యాతం నాగేశ్వరరావు అప్పటి నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు. అప్పు చేసి షెడ్డు నిర్మాణానికి వెచ్చించగా త్వరితగతిను బిల్లును మంజూరు చేయాలని ఆయన కోరుతున్నారు. ఇదే నియోజకవర్గంలో యు.కొత్తపల్లి మండలంలో 46, గొల్లప్రోలు మండలంలో 32 షెడ్లు పూర్తి కాగా అరకొర మందుకే బిల్లులు అందాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా దాదాపు 11.35 కోట్లు బిల్లులు లబ్ధిదారులకు అందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లులు మంజూరు చేయాలని జిల్లాలోని రైతులు (లబ్ధిదారులు) కోరుతున్నారు.

భవన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దాపురంలోని యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముందు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 24న తలపెట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇంటికి సామూహిక రాయబారాలు కార్యక్రమం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారన్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం పది నెలలు గడిచినా సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం జరిపే ఈ సామూహిక రాయబారాలు కార్యక్రమంలో అధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గడిగట్ల సత్తిబాబు, వడ్డి సత్యనారాయణ, వామిశెట్టి స్వామి, గొల్ల బాబు, దారపు రెడ్డి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఠాపురం మంత్రి పవన్ కళ్యాణం ఇంటికి తమ సమస్యలపై రాయబార కార్యక్రమాన్ని జయప్రతం చేయానలి పలువురు భవన నిర్మాణ రంగ నాయకులు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.సత్యనారాయణ, జి.వీరబాబు, బి.అప్పన్న బాబు, సిఐటియు నాయకులు కె.చిన్న, కె.విశ్వనాథం మాట్లాడారు. నాయకులు పప్పుల వీరబాబు, ఎం.సూరిబాబు, ఎన్.కృష్ణ, బి.అప్పారావు, ఎస్.సత్తిబాబు, కొయ్యల రమణ పాల్గొన్నారు.



పిఠాపురం సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-పిఠాపురం

రైతుల వద్ద నుండి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర తగ్గకుండా కొనుగోలు చేయాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ ఎండి నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మండలలోని గ్రామాలను సందర్శించారు. కళ్లాలలోని ధాన్యం రాశులను పరిశీలించి ధాన్యం కొనుగోలు సిబ్బందికి కొనుగోళ్ల విషయమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 శాతం తేమ ఉన్న ధాన్యాలను సత్వరం పట్టుబడి చేసి మిల్లులకు పంపవలసినదిగా ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఉన్న ధాన్యాన్ని గ్రేడ్ ఎ రకం రూ.1740, సాధారణ రకాలను రూ.1725కు కనీస మద్దతు ధరకు తగ్గకుండా ధాన్యం షావుకారులు, మిల్లర్లు కొనాలని, మద్దతు ధర కన్నా తక్కువ ధరకు కొనుగోళ్లు జరుపుతున్నట్లు నిర్ధారణ అయితే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. మండలానికి అవసరమైన గోనె సంచులను పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలకు చేరవేశామని, కొనుగోలు సిబ్బంది, విఎఎలు రైతుల కళ్లాలకు వెళ్లి ధాన్యం నమూనాలను సేకరించాలని, రైతులందరినీ అప్రమత్తం చేసి మద్దతు ధర, అంతకన్నా ఎక్కువ ధరకు మాత్రమే అమ్ముకొనేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం మండల వ్యవసాయ అధికారి ఎ.అచ్యుతరావు, ఎఇఒ రామకృష్ణ, ఎంపిఇఒ రాజేష్, పిపిసి సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న మేనేజర్

ఉపాధి పనులు పూర్తి స్థాయిలో కల్పించాలి

ప్రజాశక్తి-కాజులూరు

ఉపాధి కూలీలకు పనులు పూర్తిస్థాయిలో కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని శీలలంక, ఒంటితాడి గ్రామాల్లో ఉపాధి కూలీల సమస్యలపై ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధి కూలీలకు విరివిగా పనులు కల్పించేందుకు మండల స్థాయి అధికారులు చేస్తున్న కృషికి స్థానిక పంచాయతీలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలకు ఏప్రిల్ ఒకటి నుండి పనులు కల్పించవలసిన అవసరం ఉందని కొన్ని అనివార్య కారణాల వల్ల పనులు కల్పించడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. మండలంలో కొన్ని గ్రామాలలో పనులు ప్రారంభించారని, కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి వేతనాలు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ రామకృష్ణ

ఆర్థిక సంఘం డెలిగేట్స్‌గా అరుణ, రామకృష్ణ

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

తిరుపతిలో నిర్వహించిన 16వ ఆర్థిక సంఘం ప్రతినిధుల సమావేశంలో సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రతినిధిగా పాల్గొన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు విషయంలో శుక్రవారం తిరుపతిలో రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల డెలిగేట్స్ సదస్సులో ఆమె పాల్గొన్నారు. సామర్లకోట మున్సిపాలిటీ ప్రాముఖ్యత వివరించి స్లమ్ ఏరియా అభివృద్ధికి 16వ ఆర్థిక సంఘం నిధులు అధికంగా కేటాయించాలని కోరుతూ ఆయా ప్రాధాన్యతలను చైర్‌పర్సన్ అరుణ వివరించారు. నివేదికను 16వ ఆర్థిక సంఘం ప్రతినిధికి అందజేశారు.

పెద్దాపురం ఆర్థిక సంఘం ప్రతినిధుల సమావేశంలో పెద్దాపురం మండలం మర్లావ సర్పంచ్ తోట రామకృష్ణ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు కాకినాడ జిల్లా నుండి ఇద్దరు ప్రతినిధులను ఎంపిక చేశారు. జిల్లాలోని మర్లావ సర్పంచ్ తోట రామకృష్ణ, ఎ.అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా ఎంపికయ్యారు. శుక్రవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న రామకృష్ణ పంచాయితీల ద్వారా గ్రామాభివృద్ధి కోసం చాలినన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

జెవివి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని సూర్యారాయ విద్యానంద గ్రంథాలయంలో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుందాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.సూర్యనారాయణ మాట్లాడుతూ జెవివి చేపట్టిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు పెంచేందుకు ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అవ్వాలన్నారు. తద్వారా పేద ప్రజలకు ప్రభుత్వ నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందన్నారు. విద్యా వ్యవస్థ ప్రైవేటీకరణ పెరిగి పేద ప్రజల సంపాదనలో అధిక భాగం బడి ఫీజులు కట్టడానికే సరిపోతోందని ప్రభుత్వ విద్య వ్యవస్థను కాపాడుకోవడం ద్వారా ప్రజలపై ఆర్థికభారం తగ్గుతుందన్నారు పోస్టర్ ఆవిష్కరించిన వారిలో జెవివి మండల గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణ రెడ్డి, అధ్యక్షుడు నరాల శ్రీనివాస్, నారాయణ, బి.సుబ్రహ్మణ్యం, కె.విశ్వనాథం, నూకరాజు, మన ఊరు మన బాధ్యత అధ్యక్షుడు కొండేపూడి శంకరరావు, ఉపాధ్యాయులు ఎంవివి.సత్యనారాయణ, ఎవి.రమణమూర్తి, ఎం.మాధవన్, వి.పాములయ్య ఉన్నారు.



పోస్టర్ అవిష్కరిస్తున్న జెవివి నాయకులు

'విద్వేషాలు రెచ్చగొడుతున్న వైఎస్.జగన్'

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో అన్ని మతాలూ పరస్పర స్నేహ పూర్వకంగా ఉన్నాయని కానీ మాజీ సిఎం వైఎస్.జగన్ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపెల్ల రాజేష్ అన్నారు. శుక్రవారం కాకినాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న క్రైస్తవ సోదరులకు సిఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి రూ.30 కోట్లు విడుదల చేసి వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారని తెలిపారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పాస్టర్లకు ఏడు నెలల గౌరవ వేతనం అందించి వారిలో ఆనందం నింపారన్నారు. రాష్ట్రంలో వైసిపి, జగన్ నేతృత్వంలో టిటిడి గోశాలలో గోవుల మృతి, వక్ఫ్ బోర్డు, పాస్టర్ ప్రవీణ్ మృతి గురించి అవాస్తవాలను మాట్లాడి ఈ మూడు మతాలకు చెందిన సోదరుల మధ్య వివాదాన్ని రెచ్చగొడుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో అన్ని మతాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ వచ్చే నెల రెండో తేదీన అమరావతి పున్నప్రారంభ పనులకు ప్రధాని మోడీ హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించి విద్యార్థులకు విద్య, ఉద్యోగావకాశాలు పెంచుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోసా అబ్రహాం, కామాడి దశరథ, మేకా లక్ష్మణమూర్తి, కె.మోజెస్ కుమార్, ఎస్.ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పెద్దాపురం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో పలు పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎడిఎఫ్ఒ ఎం.శ్రీహరి జగన్నాథ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది పరిశ్రమలలో పని చేసే కార్మికులకు అగ్ని ప్రమాదాలు జరగకుండా పని చేసే ప్రదేశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఆర్పే విధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్మికులతో మంటలను ఆర్పే విధానాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఎల్ఎఫ్‌లు ఎన్.గీతాప్రసాద్, జి.దుర్గాప్రసాద్, డిఒపి హెచ్.నాగేశ్వర్, ఎఫ్ఎంలు డి.నానాజీ, ఎండి.యాకూబ్, ఎం.రాజు పాల్గొన్నారు.

పిఠాపురం అగ్నిమాపక వారోత్సవాలో భాగంగా స్థానిక బైపాస్‌లో ఉన్న జెజిఆర్ ఫ్యూయల్ పెట్రోల్ బంక్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి డి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖల ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పెట్రోల్ లేదా డీజిల్ ఫిల్లింగ్ చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అరాచకం సృష్టిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -తాళ్లరేవు

జి.వేమవరం గ్రామంలో అరాచకాన్ని సృష్టిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ బాధితులు సూరంపూడి నూకరత్నం, సూరంపూడి అర్జునరావు దంపతులు బహుజన యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు చొల్లంగి వేణుగోపాల్ ఆధ్వర్యంలో కోరంగి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుకూలి నరసయ్య, అనుకూలి బాబురావు (బాబ్జి), అనుకూలి శ్రీనివాస్ నూకరత్నంకు చెందిన ఇంటి బయట నుంచి రాకూడదని ఇది తమ స్థలమంటూ గొడవలు చేస్తున్నారన్నారు. ఈ స్థలంలో ప్రభుత్వం 20 ఏళ్ల క్రితమే సిమెంట్ రోడ్డు వేసినా నాటి నుంచి ఏ విధమైన గొడవలు జరగలేదని కానీ ఫిబ్రవరి నెల నుంచి ఈ ముగ్గురు ఈ స్థలం వారిదని దౌర్జన్యం చేసి గొడవలు సష్టించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. వారం రోజుల క్రితం రాత్రి సమయంలో వారు కత్తులు, కర్రలతో దాడి చేసి చంపేస్తామంటూ బెదిరించారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకుని గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. అయినవిల్లి నారాయణ, వాసంశెట్టి భీమరాజు, అనుసూరి రాజకుమారి, చింతపల్లి చంద్రశేఖర్, గండి అనిల్, పెంకే సూరిబాబు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-కాకినాడ

ఎస్‌సి వర్గీకరణను నిరసిస్తూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్తంగా దళితుల ఐక్యతపై అన్ని రాజకీయ పార్టీలూ కుట్ర చేస్తున్నాయని చెప్పారు. అనంతరం చేపట్టిన ఒక్కరోజు దీక్షను ఆయన విరమించారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

జిల్లావ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని చర్చిలో గుడ్ ఫ్రై డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ పవిత్ర గుడ్ ఫ్రై డే సందర్భంగా యేసు క్రీస్తు త్యాగాన్ని గుర్తు చేసుకోవాలని, ఆయన చూపిన దయ, ప్రేమ, కరుణ, క్షమా గుణం వంటి సద్గుణాలను ఆదర్శంగా తీసుకుని నడవాలని అన్నారు. చర్చి ఫాస్టర్ పీటర్, హాస్టల్ చీఫ్ వార్డెన్ పి.ఎల్.ప్రసాదరావు హాస్టల్ విద్యార్థినీ విద్యార్థులు ప్రార్థనలు, సువార్త కీర్తనలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.

గొల్లప్రోలు పట్టణంలో ఆర్‌సిఎం దేవాలయం ఫాదర్ జేమ్స్ భాను ఆధ్వర్యంలో క్రైస్తవులు పెద్ద పాల్గొని ఏసుక్రీస్తు సిలువను భుజంపై మోస్తూ పట్టణమంతా పాదయాత్ర నిర్వహించారు. అనంతరం దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ జేమ్స్ బాండ్ మాట్లాడుతూ క్రీస్తు మార్గంలో ప్రజలందరూ శాంతి సమాధానాలతో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వంశీ, కె.డేవిడ్‌రాజ్, పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

సామర్లకోట ఆర్‌సిఎం చర్చి ఫాదర్ పీటర్ ఆధ్వర్యంలో సిలువ యాత్ర నిర్వహించారు. చర్చి వద్ద నుంచి స్టేషన్ సెంటర్ వరకు తిరిగి స్టేషన్ సెంటర్ గడియార స్తంభం వద్ద నుంచి ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. పట్టణంలోని ప్రధాన దేవాలయాలైన ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, సెంటినరీ బాప్టిస్ట చర్చి, ఆగస్థానా లూథరన్ చర్చిలో వేడుకలు నిర్వహించారు. పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బిషప్ డాక్టర టి.బ్లెస్సింగ్, జి.జయబాబు తెలిపారు. రన్ ఫర్ జీసస్ బ్యానర్లు, కరపత్రాలను వారు ఆవిష్కరించారు.

పెద్దాపురం గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక కట్టమూరు పుంత రహదారిలో ఉన్న కల్వరి మిరాకిల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డాక్టర్ లంక పురుషోత్తమ దాస్, లంక ఏసుదాస్, మేరీ రాజకుమారి వర్తమానం అందించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ దాస్, పీటర్, దయాకర్ దాస్, జ్యోతి, స్వరూప రూతుమణి, లక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.



సామర్లకోటలో క్రైస్తవుల సిలువ యాత్ర



గండేపల్లిలో చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు



గొల్లప్రోలులో క్రైస్తవుల గుడ్ ఫ్రైడే ప్రదర్శన

సత్యదేవుని దర్శించుకున్న తుమ్మలబాబు


ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి వారిని కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ తుమ్మల బాబు శుక్రవారం కుటుంబంతో కలిసి దర్శించుకున్నారు తుమ్మల బాబుకు దేవస్థానం అధికారులు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ బాబు స్వామివారి వ్రతం ఆచరించి పూజలు చేశారు. దేవస్థానం పిఆర్ఒ కృష్ణారావు స్వామివారి ప్రసాదాన్ని చిత్రపటాన్ని అందజేశారు.



అన్నవరం కొండపైన కుడా చైర్మన్ తుమ్మల బాబు

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

గుర్తుతెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మామిడికుదురు

మామిడికుదురు 216వ జాతీయ రహదారిలో గ్రోప్రస్ ఎదురుగా శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీ కొని పెదపట్నం లంక గేడ్డం వారి పేటకు చెందిన బూల వెంకటరత్నం(34) అక్కడకక్కడే మృతి చెందాడు. వివరాలు ఇవి.. మోటార్ సైకిల్‌పై కరెంటు సామాన్ల కోసం వెంకటరత్నం మామిడి కుదురు వస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదానికి గురయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు మతునికి ఏడేళ్ల క్రితం లక్ష్మీ దుర్గ తో వివాహమైంది. అతనికి ఆరేళ్ల భరత్ సాయి, రెండేళ్ల మాధురి లక్ష్మి సంతానం. హైదరాబాద్లో సిఎంఆర్ లో పనిచేస్తున్న వెంకటరత్నం మూడు రోజుల సెలవులు రావడంతో స్వగ్రామము వచ్చి రోడ్డు ప్రమాదంలో మతి చెందడం కుటుంబ సభ్యులను కలచివేసింది. కుటుంబ యజమాని మృతితో తమ జీవనోపాధి కోల్పోయామ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ఈ ఘటనపై నగరం ఎస్ఐ చైతన్య కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గుళ్లలో చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

ముగ్గుళ్ళ గ్రామంలో శుక్రవారం చోరీ జరిగింది. బాధితులు కూచిపూడి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ చోరీ జరిగిందన్నారు. బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు, కాసు బంగారు సూత్రం, ఇత్తడి గొలుసు, వెండి సామగ్రి, గ్యాస్ బండ చోరీకి గురయ్యాయన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గుర్తుతెలీని మహిళ మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని ఎర్రవరం ఏలేరు కాలువలో గుర్తు తెలీని 50 ఏళ్ల పైబడిన మహిళ మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు తెలిపిన వివరాలివి. ఎర్రవరం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఏలేరు కాలువలో 50 ఏళ్ల పైబడిన మహిళ మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో లభించిందన్నారు. మృతురాలు లేత ఆకుపచ్చ రంగు జాకెట్టు, ముదురు ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉందన్నారు. ఎర్రవరం విఆర్ఒ ఎం.అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బంధువులు గుర్తింపు నిమిత్తం ప్రతిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్టు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ నెంబర్ 08868 224033, లేదా 9440904835 నంబర్లకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్లు, బెంచీల అందజేత

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని కొత్తకోట గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలకు గ్రామస్తుడి నామాన్ని సత్తిబాబు బెంచీలు, ఫ్యాన్లు, బీరువాలు, ప్రింటర్, గ్రీన్ బోర్డు తదితర ఫర్నీచర్ బహూకరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆయన ఏర్పాటు చేసిన బెంచీలు, ఫ్యాన్లు తదితర వస్తువులు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో చేయూత

ప్రజాశక్తి - ఆలమూరు

ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణతో మహిళలకు చేయూతనందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉదని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, ఆలమూరులలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌డిఒ ఎ.రాజులతో కలిసి కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో కటింగ్, స్టిచ్చింగ్ లబ్ధిదారులకు నేర్పిస్తారని అన్నారు. ం. అలాగే 75 శాతం హాజరు తప్పక ఉండాలని వారికి ఉచితంగా మిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఇదంతా మీ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ రెండు కేంద్రాల ద్వారా సుమారు 300 మంది మహిళలకు లబ్ధి చేకూరనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిసి అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి, జనసేన మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, సర్పంచులు దంగేటి చంద్రకళ బాపనయ్య, నాతి లావణ్య కుమార్ రాజా, కార్యదర్శులు ఎం.వెంకటరెడ్డి, కె.మోక్షంజలి, పాల్గొన్నారు.

సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి - మామిడికుదురు

నగరం' గ్రామానికి చెందిన బుర్ర కథ కళాకారుడు మంగం సత్యనారాయణ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. హైదరాబాదులో డాక్టర్ ఎన్‌టిఆర్ కళామందిర్‌లో గురువారం జరిగిన సమావేశంలో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకమైన డాక్టరేట్ అవార్డుతో మంగం సత్యనారాయణను సత్కరించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. సత్యనారాయణను పలువురు అభినందించారు.

సేవా కార్యక్రమాలకు చేయూత

ప్రజాశక్తి -మామిడికుదురు

సామాజిక సేవా కార్యక్రమాలకు ఒఎన్‌జిసి చేయూతనిస్తుందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతన్ దాస్ అన్నారు అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని శుక్రవారం ఆయన చీఫ్ జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్.రామారావు తో కలిసి, కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వాదం అందజేశారు ఆలయ సహాయ కమిషనర్ ఎం. సత్యనారాయణ రాజు ఇడికి నూతన వస్త్రాలు బహూకరించి స్వామివారి ప్రసాదం అందజేశారు అనంతరం ఆలయ ఆవరణలో ఒఎన్‌జిసి నిధులు రూ.ఐదు లక్షలతో నిర్మిస్తున్న వాటర్ ప్లాంట్ ను పరిశీలించి, నిర్మాణ పనుల తీరు అడిగి తెలుసుకున్నారు దీనిని త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు.

శారీరక వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రతిరోజు శారీరక వ్యాయామం చేయడం వల్ల మనక్కు మరింత శక్తితో పాటు సాధారణ ఆరోగ్యం మెరుగు పడుతుందని పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ వ్యాయామ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 18న జాతీయ వ్యాయామ దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. ప్రజలందరిలో వ్యాయామం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవ లక్ష్యమన్నారు. క్రమం తప్పకుండా శారీర వ్యాయామం చేయడాన్ని దినచర్యలో ఒక భాగంగా చేసుకోవాలన్నారు. వ్యాయామాలలో సులభమైంది వాకింగ్ అన్నారు. ప్రతిరోజు 30 నిమిషాల పాటు వాకింగ్ చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా అధిక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని మల్లీశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సలో ఫిజియోథెరపీ కీలక పాత్ర

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆరోగ్య జీవనాన్ని కొనసాగించేందుకు నిర్దేశించిన ఒక ప్రముఖ వైద్య ప్రక్రియ ఫిజియోథెరపీ అని వైద్య చికిత్సలో ఈ వైద్య విధానం కీలక పాత్ర పోషిస్తుందని ఆ వైద్య నిపుణురాలు సత్యవాణి పేర్కొన్నారు. బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. చాతి, గుండె, కండరాల నొప్పులు, పక్షవాతం, అంగవైకల్యంతో పాటు క్యాన్సర్ వల్ల వచ్చే నొప్పులకు చక్కటి ఉపశమనం ఫిజియోథెరపీ ద్వారా లభిస్తుందన్నారు. పెద్ద ఖర్చు లేకుండా, శరీరాన్ని పాడు చేయకుండా చేసే వైద్యమే ఫిజియోథెరపీ అని సత్యవాణి తెలిపారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, యనమల రామం, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, ఎం.సుబ్బారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసమానతల తొలగింపునకు రుణాలు

ప్రజాశక్తి-తుని

ఆర్థిక అసమానతలు తొలగించాలని ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను మంజూరు చేస్తున్నట్టు మాజీ ఆర్థిక మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం తేటగుంట పార్టీ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి తోపాటు, తుని నియోజకవర్గ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తున్న కార్పొరేషన్ల రుణాలను పారదర్శకంగా అందించాలని అధికారులకు సూచించారు. సచివాలయాల సిబ్బంది ఖాళీలను బట్టి సర్దుబాటు చేయాలని యనమల సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చింతమనేడు అబ్బాయి, మోత్కూరు వెంకటేష్, తుని ఎంపిడిఒ కె.సాయి నవీన్, ఇఒపిఆర్‌డి జయరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి పని చేయాలి

ప్రజాశక్తి-కిర్లంపూడి

వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. పార్టీ ప్రత్తిపాడు మండల నూతన కమిటీ ఉపాధ్యక్షుడుకిలాడి బాబ్జి, ఎగ్జిక్యూటివ్ మెంబెర్ సానా పోలరాజు శుక్రవారం గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీలో బాధ్యతగా కష్టపడి పని చేస్తారనే నమ్మకంతో పార్టీలో పదవుల్లో నియమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జువ్వల చినబాబు, రాపా గుర్రాజు, యెంటి వీర్రాజు, గదుల శివ పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో కుడా చైర్మన్ పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కుడా చైర్మన్ తుమ్మల బాబు కుటుంబ సమేతంగా శుక్రవారం పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలోని నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య ఆధ్వర్యంలో ఆలయ ఆసాదులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం వారు నూకాలమ్మవారికి వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో నిర్వహించిన పంచామత అభిషేకాలు, లక్ష కుంకుమార్చన పూజలలో పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు పోలీసుల మోక్షం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో గుంతల మయంగా ఉన్న రోడ్డుకు రిపేర్లు చేపట్టడంలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు చిరు సాయం చేశారు. స్థానిక స్టేషన్స్ సెంటర్లోని యతి హోటల్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారికి పడిన గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కారణంగా ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు జోక్యంతో దాత సహకారంతో కాంక్రీటుతో గోతులకు రిపేరు పనులు చేపట్టారు.

మరిడమ్మ ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో ఆమె మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని దేవస్థానం తరుపున ఈ మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, పూజారి ఐవి.ప్రసాద్ శర్మ, వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, ఆలయ సిబ్బంది ఎస్.రమణ, వరహాలు, శివ సేవలందించారు.

మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సీతానగరం

ముగ్గళ్ళ గ్రామంలో ఉపాధి హామీ పని చేస్తుండగా పాముకాటుకు గురై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతన్న జనసేన పార్టీ 'నా సేన కోసం నా వంతు' కో-ఆర్డినేటర్, ఎంఎల్ఎ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి ఆర్థిక సాయం అందించారు. విషయం తెలుసుకున్న ఆమె వెంటనే ఆసుపత్రికి వెళ్లి బాధితురాలని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు అందించారు.

పోలీసుల నాకాబందీ

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో పురుషోత్తంపట్నంలో పోలీసులు శుక్రావారం నాకాబందీ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి తొమ్మిది గంటల నుంచి పన్నెండు గంటల వరకూ అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్‌కుమార్ మాట్లాడుతూ డిజిపి ఆదేశాలు మేరకు ఎస్‌సి నరసింహకిశోర్ సూచనలతో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

'బాపూజీ'లో విలువలతో కూడిన విద్య

ప్రజాశక్తి-గోపాలపురం

క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించి విద్యార్థులను గొప్ప ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూలు లక్ష్యమని కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తమ పాఠశాలలో నర్సరీ నుంచి ఏడో తరగతి వరకూ విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు విద్యార్థులకు ప్రణాళికతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు

భూదానోద్యమంతో పేదలకు భూపంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గాంధేయవాది వినోబా భావే 1951 ఏప్రిల్ 18న నల్గొండ జిల్లా పోచంపల్లిలో భూస్వాములను తమ దగ్గర ఉన్న భూములలో కొంత భాగాన్ని భూములు లేని నిరుపేదలకు పంచి ఇచ్చేందుకు చేసిన ప్రయత్నం విజయవంతం అవడంతో ఏటా ఏప్రిల్ 18న భూదాన యాత్ర సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో భూదాన యాత్ర సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ ప్రతిపాదించిన సర్వోదయ, గ్రామ స్వరాజ్యం ఉద్యమాలచే ప్రేరేపితుడైన వినోబాభావే భూదానోద్యమాన్ని ప్రారంభించారని అన్నారు. ఈ ఉద్యమం కోసం ఆయన భారతదేశం అంతటా పర్యటించారని అన్నారు. ఈ ఉద్యమం ఇంకా ముందుకు వెళ్లి ఒక గ్రామ బహుమతి లేదా గ్రామ దాన ఉద్యమంగా రూపాంతరం చెందిందని అన్నారు. భూమి లేని వారికి అనుకూలమైన పరిస్థితులను సష్టించడం ద్వారా గణనీయమైన సహకారాన్ని ఈ ఉద్యమం అందించిందని బుద్ధ రాజు తెలిపారు.


వినోబాబాబేకు నివాళి అర్పిస్తున్న సిటిజన్స్ ప్రతినిధులు

తొలితగా వినోబా భావే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ సువర్ణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వం ద్వారా కార్యకర్తలకు బీమా

ప్రజాశక్తి- తాళ్ళరేవు

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ద్వారా ఉన్న బీమా సౌకర్యాన్ని కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. పి.మల్లవరంలో పార్టీ సమావేశం స్థానిక డిజిబి కళ్యాణ మంటపంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సుబ్బరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. పార్టీ సభ్యత్వం చేయించుకున్న అందరికీ ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంటుందని, కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ ఈ చర్యలు తీసుకుందని తెలిపారు. అనంతరం సభ్యత్వం కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, విళ్ల సత్యనారాయణ, ధూళిపూడి సుబ్బారావు, పితాని విష్ణు, సత్యవతి,


సభ్యత్వం కార్డులు అందిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

దున్నా సుబ్రహ్మణ్యం, ధూళిపూడి సుబ్రహ్మణ్యం, వి.సుబ్బారావు, కృష్ణ, బళ్ల చిరంజీవి, దడాల సత్తికొండ, దున్నా క్రాంతి, వెంటపల్లి పురుషోత్తం, శివ, దొమ్మేటి లోవరాజు, వీరబాబు పాల్గొన్నారు.

మానసిక స్థయిర్యంపై విద్యార్థులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-శంఖవరం

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కస్తూరిబా బాలిక విద్యాలయాల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. పరీక్షలే జీవితం కాదని, ఎంతో విలువైన అందమైన జీవితమని, పరీక్షలు-ఫలితాలు, గెలుపోటములు చిన్న మజిలీలు మాత్రమే అని అవగాహన కలిగించి, వారి భవిష్యత్ ప్రణాళికలకు ప్రేరణ కలిగించారని ప్రిన్సిపల్ బాలామణి తెలిపారు. ఈ సదస్సులో భాగంగా పిల్లలతోతో రోల్ ప్లే చేయిస్తూ, విద్యార్థులకు కొన్ని సమస్యా పరిష్కార నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం, ధైర్యంగా జీవిత సవాళ్ళను ఎదుర్కోవడం, భావోద్వేగ నియంత్రణ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ


విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఆరోగ్య కౌన్సిలర్లు

కార్యక్రమంలో రిసోర్సు పర్సన్‌గా మానసిక ఆరోగ్య కౌన్సెలర్ కుసుమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పునర్వికాసాన్ని సాధిద్దాం...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గ్రంథాలయ పునర్వికాసాన్ని సాధిద్దామని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ తెలిపారు. రాజమహేంద్రవరంలోని గోదావరి బాలోత్సవం కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల ప్రారంభ సభ శుక్రవారం జరిగింది .ఈ కార్యక్రమానికి అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి స్వామిప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా వల్లూరు శివప్రసాద్ హాజరై మాట్లాడారు. సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, మానసిక వికాసానికి తోడ్పడుతున్న గ్రంథాలయాలు కనీస సౌకర్యాలు లేక దీనావస్థలో ఉన్నాయన్నారు. గ్రంథాలయ పునరుజ్జీవనం ద్వారా వెలుగులు నింపే బాధ్యత నేటి సమాజంపై ఉందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలు చెల్లించే ఆస్తి పన్నుల్లో 8 శాతం గ్రంథాలయ సెస్ కలిసి ఉంటుందన్నారు.

3వ శనివారం 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పి.ప్రశాంతి తెలిపారు. ఏదొక గ్రామం లేదా మున్సిపల్ కార్యాలయం పరిధిలో శానిటేషన్, డ్రెయినేజీ క్లీనింగ్ కార్యక్రమంలా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించేలా తీర్చిదిద్దుతామన్నారు. 'తక్కువ వ్యర్థాలు ఉండేలా, తిరిగి వినియోగించాలి, వ్యర్థాలు తగ్గించాలి' అనే 'ఆర్ఆర్ఆర్' కాన్సెప్ట్‌తో కార్యక్రమాన్ని రూపొందించామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. అందులో భాగంగానే ఈ శనివారం 'ఈ-వేస్ట్ మేనేజ్‌మేంట్'తో కూడిన కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. కార్యాలయాల్లో, గహల్లో వృథాగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను మున్సిపల్, గ్రామ పంచాయతీలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ సేకరణ కియోస్కుల వివరాలు తెలుసుకుని అక్కడ అందించాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల వాతావరణం కాలుష్యం అవుతుందన్నారు. తద్వారా పలు అనారోగ్య సమస్యను ఎదుర్కోనాల్సి వస్తుందని తెలిపారు. శనివారం జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె ప్రజలను కోరారు. స్థానిక రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉన్న వైటిసి భవనంలో జిల్లా స్థాయి స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరాలంటే పాఠశాల యాజమాన్యమే కాకుండా తల్లిదండ్రుల బాధ్యత, పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని ఎస్ఐ టి.రామకృష్ణ అన్నారు. తాళ్లపూడిలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆవరణలో పాఠశాల 23వ వార్షికోత్సం శుక్రవారం జరిగింది. దీనికి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు సెల్ ఫోన్లను దూరంగా ఉంచాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలు నిజమని అనుకుంటూ విద్యార్థులు చెడు అలవాట్లకు లోనవుతున్నారన్నారు. పాఠశాల వ్యవస్థాపక కరస్పాండెంట్ అనీష్ మాట్లాడుతూ 2002లో తమ పాఠశాల 23 మంది విద్యార్థులతో ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం 900 మంది విద్యార్థులతో కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆలోచనతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు, ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు ఒక్కరోజు కూడా బడికి మానకుండ వచ్చిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఉన్నత స్థానాలు సాధించాలి

తాళ్లపూడి : క్రీడల్లోనూ, చదువులోనూ రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని గజ్జరం సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు విద్యార్థులకు సూచించారు. గ్రామంలో వెల్ కేర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సుమారు 2వేల మందికి విందు ఏర్పాటు చేశారు. అతిథులుగా పిట్టా శ్రీనివాస్, మరిచర్ల శ్రీనివాస్, పాలపర్తి రమణ, బోడిగడ్ల గోవింద హాజరయ్యారు. కుల మతాలకతీతంగా ఈ విందులో పాల్గొన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఇసుకపల్లి, ఎండపల్లిలో వ్యవసాయ శాఖ అధికారి ఎడిఎ పి.స్వాతితో కలిసి గ్రామాల్లో ఉన్న ధాన్యం కళ్లాలను వారు పరిశీలించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తారని, రైతులు ఎవరూ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పని లేదన్నారు. మద్దతు ధర కల్పించి రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఎంఎఒ వి.జోగిరాజు, ఎఇఒ డి.నాగేంద్ర జనసేన నాయకులు రైతులు పాల్గొన్నారు.